
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 7 సెప్టెంబరు 2025





మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీ

● రేషన్ లబ్ధిదారులతో డీలర్లు స్నేహపూర్వకంగా ఉండండి: కలెక్టర్

6 లో

గణ.. నిమజ్జనం



శ్రీకాకుళంలో వారాహి అమ్మవారితో గణనాథుడు ఉన్న విగ్రహం ఊరేగింపు



నాగావళి నదిలో వినాయక విగ్రహాల నిమజ్జనం



వెళ్లిరా... వినాయకా!

● సందడిగా గణేశ విగ్రహాల నిమజ్జనం

గుజరాతీపేట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. శనివారం రాత్రి భారీస్థాయిలో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని మేళతాళాలు, డప్పువాయిద్యాలు, కోలాటం, తప్పెటగుళ్ల ప్రదర్శనలతో విగ్రహాల ఊరేగింపు చేపట్టారు. శ్రీకాకుళంలోని రైతుబజారు, కత్తెరవీధి, ఇందిరానగర్ తదితర కాలనీల్లో విగ్రహాలను ఊరేగించి.. నాగావళి నదిలో నిమజ్జనం చేశారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

- మరిన్ని వివరాలు 6లో

నేడు చంద్ర గ్రహణం

● మధ్యాహ్నం నుంచి ఆలయాల మూసివేత

అరసవల్లి/ కోటబొమ్మాళి/ టెక్కలి/ టెక్కలి రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం ఆదివారం ఏర్పడనుంది. రాత్రి 8:58గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమవుతుంది. 8వ తేదీ తెల్లవారుజామున 2:25 గంటలకు చంద్ర గ్రహణం ముగుస్తుంది. గ్రహణం నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి అరసవల్లిలో ఆదిత్యాలయాన్ని మూసివేయనున్నట్టు ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో కేఎన్ వీడీవీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంప్రోక్షణ, పూజలు అనంతరం మళ్లీ సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి స్వామి దర్శనానికి భక్తులను అనుమతిస్తామన్నారు. భక్తులు ఈ విషయన్ని గమనించాలని సూచించారు. అలాగే ఆది వారం మధ్యాహ్నం 12గంటల నుంచి కొత్తమ్మతలి ఆలయాన్ని మూసివేస్తామని కార్యనిర్వాహక అధికారి వాకచర్ల రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం వేకువజామును 3.30 గంట లకు ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ చేపడతామన్నారు. అలాగే టెక్కలిలోని లక్ష్మీనరసింహస్వామి, రావివలసలోని ఎండల మల్లి కార్జున స్వామి ఆలయాలు మూసివేస్తున్నట్లు ఈవో జి.గురు నాథరావు తెలిపారు. సోమవారం సంప్రోక్షణ అనంతరం ఆలయాలు తెరుస్తామని చెప్పారు.



న్యాయమూర్తులు జస్టిస్ వివేక్ అగర్వాల్, జస్టిస్ విశాల్ ధగాట్‌కు ఆదిత్యుడి చిత్రపటాలను అందజేస్తున్న ఈవో, అర్చకులు

ఆదిత్యుని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

అరసవల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం.. అరసవల్లిలోని ఆదిత్యుడిని మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వివేక్ అగర్వాల్ దంపతులు, జస్టిస్ విశాల్ ధగాట్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. వారికి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి ప్రసాదాలు, జ్ఞాపికలను ఈవో కెఎన్‌విడివి.ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో నేతింటి హరిబాబు, ఇప్పిలి సందీపశర్మ, పార్థ సారధి, బాల భాస్కరసాయి పాల్గొన్నారు.





అధికారులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

పక్కాగా బాలల రక్షణ చట్టాలు

● జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా

శ్రీకాకుళం లీగల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బాలల రక్షణ చట్టాలు పక్కాగా అమలు చేయాలని న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయాధికారి జూనైద్ అహ్మద్ మౌలానా ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు భవనంలో.. బాలల రక్షణ చట్టాల అమలు తీరుపై న్యాయ సమీక్ష నిర్వహించారు. చట్టాల అమలులో అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. బాలలకు అందించాల్సిన న్యాయసహాయంపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో 1వ అదనపు జిల్లా న్యాయాధికారి పి.భాస్కరరావు, జువైనల్‌జస్టిస్ బోర్డు న్యాయాధికారి కేఎం జమ్రత్ బేగం, జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్మన్ యు.శ్రీలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

● నడుం లోతులో నదిని దాటుతున్న వీరు ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు గ్రామస్థులు. ఏటా వర్షాకాలంలో వీరికి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ గ్రామంలో 800 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. ఆ పొలాలకు వెళ్లాలంటే నడిమిగెడ్డ, నాసిగెడ్డ దాటాల్సిందే. బాహుదా నదిలో నీరు లేనప్పుడు పర్వాలేదు కానీ.. వర్షాకాలంలో బాహుదా నదిలో నీరు పొంగి ప్రవహించినప్పుడు మాత్రం ఈ గ్రామస్థులు బిక్కుబిక్కుమంటూ గెడ్డలు దాటాల్సిందే.



● పొంగి ప్రవహిస్తున్న బాహుదా
● బిక్కుబిక్కుమంటున్న బూర్జపాడు రైతులు
● ఏటా తప్పని ముంపు సమస్య

పొలం వెళ్లాలంటే.. గెడ్డ దాటాల్సిందే



బూర్జపాడులో వాగు గట్టుపై వెళ్తున్న రైతులు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రధాన సాగునీటి వనరు బాహుదా నది పొంగి ప్రవహిస్తుండడంతో.. బూర్జపాడు గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏటా వర్షాకాలం వచ్చిందంటే చాలు వరదనీరు పోటెత్తి పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఇచ్ఛాపురం మండలం బూర్జపాడులో దాదాపు 1,000 ఎకరాల ఆయకట్టు ఉంది. సుమారు 800 ఎకరాల పొలాలు నడిమిగెడ్డ, నాసిగెడ్డ అవతల ఉంటాయి. ఇవి బాహుదా నదికి అనుసంధానంగా ఉంటాయి. బాహుదాకు వరదలు వస్తే ఈ రెండు గెడ్డలు పొంగి ప్రవహిస్తాయి. దీంతో బూర్జపాడు ఆయకట్టు 800 ఎకరాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. అందుకే వ్యవసాయ పరికరాలు, యంత్రాలను ముందుగానే పొలాలకు తరలిస్తారు. జూన్‌లోనే వరి విత్తనాలు వేసిన సమయంలో ట్రాక్టర్లు, దమ్ముసెట్లు, ఇతర పరికరాలను తరలిస్తారు. మనుషులు అత్యంత ప్రమాదకర స్థితిలో గెడ్డలు దాటుతుంటారు. ఆ సమయంలో ప్రమాదం జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ గెడ్డలపై కాజ్‌వేలు, వంతెనలు నిర్మిస్తామన్న పాలకుల హామీ కార్యరూపం దాల్చడం లేదు.

● ఇదీ పరిస్థితి..

బాహుదా నది.. ఒడిశాలో పుట్టి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో 12 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ఇచ్ఛాపురం పట్టణంతోపాటు మరో 30 గ్రామాలకు ప్రధాన సాగునీటి ఆధారం బాహుదే. కానీ నదికి సంబంధించి సరైన నిర్వహణ లేదు. నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, గత పాలకుల తప్పిదాలు, నదిలో నీటి ప్రవాహం మార్పులు తదితర కారణాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒడిశా ఎగువ ప్రాంతాల్లో (మిగతా 6వ పేజీలో..)

సమస్యల పరిష్కారానికి
చొరవ చూపాలి
● మంత్రి అచ్చెన్నాయుడు
8 లో

ఎయిడ్స్ నివారణపై
అవగాహన అవసరం
● డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత
7 లో

సముద్ర తీరాలకు
సోలార్ వెలుగులు

ఎలుగుబంటి బీభత్సం

● మందస మండలంలో నలుగురిపై దాడి
● ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు
● ఆందోళనలో ఉద్దానం వాసులు

హరిపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మందస మండలం నారాయణపురం, సువర్ణాపురం, రంగనాథపురం గ్రామాల పరిధిలో శనివారం ఉదయం ఎలుగుబంటి బీభత్సం సృష్టించింది. జీడితోటల్లో పనులు చేస్తున్న జి.లక్ష్మినారాయణ, పందిరి పున్నయ్య, గొరకల మోహనరావు, పాపయ్యపై దాడి చేసింది. దీంతో స్థానికులు వారిని అంబులెన్స్‌లో హరిపురంలో ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారులు స్వరాజ్యలక్ష్మి, బాలకృష్ణ చేశారు. ప్రాణాపాయం తప్పిందని తెలిపారు. విషయం తెలుసుకున్న అటవీశాఖాధికారులు మురళీకృష్ణం నాయుడు, నరేంద్రరెడ్డి (మిగతా 6వ పేజీలో..)



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న అటవీశాఖాధికారులు

గిరిజన మహిళలకు శుభవార్త



● మెళియాపుట్టి మండలం బంజీరు గ్రామానికి చెందిన **జన్ని అక్కమ్మ** కుటుంబంలో ఇద్దరే ఉంటు న్నారు. ఇప్పటికీ గ్యాస్ కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేక కట్టెలపొయ్యిని వినియోగిస్తున్నారు.



● మెళియాపుట్టి మండలం నేల బొంతు గ్రామానికి చెందిన **సుందరమ్మ**కు ఏ ఆధారం లేదు. ప్రభుత్వ పింఛన్‌తోనే బతుకుతోంది. పొగ కారణంగా కళ్లు సరిగా కనిపించకపోయినా.. కట్టెలపొయ్యినే వినియోగిస్తోంది. గ్యాస్ కొనేంత డబ్బులు తమ దగ్గర లేవని వాపోతోంది.



● దీపం పథకం-2 కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు
● త్వరలో మంజూరుకు సన్నాహాలు
● జిల్లాలో 5వేల మందికి లబ్ధి చేకూరే అవకాశం

మెళియాపుట్టి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):

● ఇటువంటి గిరిజన మహిళలందరికీ రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయనున్నట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. దీంతో గిరిజన మహిళలందరికీ లబ్ధి చేకూరనుంది. ఎన్నికల హామీల అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం దీపం పథకం కింద ఇప్పటికే ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేస్తోంది. గతేడాది ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో నవంబరు 1న సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభించారు. జిల్లాలో 6,92,825 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటికి రెండు విడతల్లో లబ్ధిదారులకు ఉచిత సిలిండర్లు అందాయి. ప్రస్తుతం మూడో విడత అమలవుతోంది. తాజాగా గిరిజన మహిళలకు దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరుకు చర్యలు చేపడుతోంది. జిల్లాలోని 16 మండలాల్లో 672 గిరిజన గ్రామాలు ఉన్నాయి. 93,877మంది గిరిజనులు నివసిస్తున్నారు. గ్యాస్ కొనుగోలు ఆర్థిక భారం కావడంతో ఇప్పటికీ చాలామంది కట్టెలపొయ్యినే వినియోగిస్తున్నారు. రహదారులు లేక కొంతమంది గ్యాస్ కనెక్షన్లు తీసుకోలేదు. సుమారు 30వేల కుటుంబాలు కట్టెలపొయ్యిపైనే వంట చేస్తున్నట్టు సమాచారం. ఇటువంటి వారికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు ప్రభుత్వం ఇవ్వనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 23,912 (మిగతా 6వ పేజీలో..)

మా డబ్బులు ఎప్పుడిస్తారు?

● ఇచ్ఛాపురంలో పోస్టాఫీస్ వద్ద ఖాతాదారుల నిరసన
● రెండు వారాల్లో చెల్లించాలని డిమాండ్
● లేదంటే నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరిక

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో పోస్టాఫీసు వద్ద ఖాతాదారులు శనివారం నిరసన చేపట్టారు. తాము దాచుకున్న డబ్బులు ఎప్పుడిస్తారని అధికారులను నిలదీశారు. కుటుంబ అవసరాలు, చదువులు, వివాహాలు, వైద్యసేవల నిమిత్తం చాలామంది ఖాతాదారులు పోస్టాఫీసులో డబ్బులు దాచుకున్నారు. ఇటీవల కొంతమంది చేతివాటం కారణంగా ఆన్‌లైన్ మోసం వెలుగుచూడడంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలలుగా తాము దాచుకున్న డబ్బులు ఇవ్వాలంటూ పోస్టాఫీసు చుట్టూ తిరుగుతున్నారు. అయినా అధికారుల్లో స్పందన లేకపోవడంతో శనివారం చాట్ల లోహిదాస్‌రెడ్డి, ఇసురు బాలరాజు, కిరణ్మయి, శ్యాంకుమార్, ప్రశాంత్ తదితర ఖాతాదారులు పోస్టాఫీస్ వద్ద ఆందోళన చేశారు. తమ డబ్బులు ఎప్పుడిస్తారో స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

● పోస్టల్ సిబ్బంది జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్(ఎస్పీ) అధికారి వి.హరిబాబుకు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చారు. ఆయన బాధితులతో ఫోన్‌లో మాట్లాడి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. బాధితుడు లోహిదాస్ ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడుతూ.. 'మా కుటుంబానికి సంబంధించి దాచుకున్న రూ.11లక్షలతోపాటు 33 ఖాతాదారుల సొమ్మును పోస్టల్ సిబ్బంది దోచుకున్నారు. మరో 5మందికి నకిలీ పాస్ పుస్తకాలు ఇచ్చి మోసానికి పాల్పడ్డారు. మొత్తంగా సుమారు రూ.2.87 కోట్లు వరకు ఆన్‌లైన్ మోసం జరిగింది. మా డబ్బులు మాకు ఇవ్వాల'ని చెప్పారు. అలాగే మరికొంతమంది బాధితులు మాట్లాడుతూ రెండు వారాల్లో తమ డబ్బులు వడ్డీతో (మిగతా 6వ పేజీలో..)



ఇచ్ఛాపురంలో పోస్టాఫీస్ వద్ద బాధితుల నిరసన

వెళ్లిరా.. వినాయకా

- సందడిగా గణేశ విగ్రహాల నిమజ్జనం
- మేళతాళాలతో ఊరేగింపు
- ఉత్సాహంగా పాల్గొన్న యువత

వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలను జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో ఆబాలగోపాలం ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణాలు, పల్లెల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను తొలుత స్థానికంగా ఊరేగించారు. యువత డ్యాన్సులతో హోరెత్తించారు. అనంతరం సమీపంలోని నదులు, చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. వివిధ మండపాల వద్ద ఏర్పాటు చేసిన లడ్డూలను వేలం పాటల్లో భక్తులు దక్కించుకున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం


రణస్థలం: గరికిపాలెం వినాయక నిమజ్జనోత్సవంలో పాల్గొన్న మహిళలు


కంచిలి: ఏకవింశతి ముఖ వినాయకుని ఊరేగింపు


గుజరాతీపేట:కత్తెరవీధిలోని గణేశుడి ఊరేగింపు




శ్రీకాకుళం: వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం


నరసన్నపేట: సంతపేటలో పల్లకిలో వినాయకుని ఊరేగిస్తున్న మహిళలు


కంచిలి: వినాయక నిమజ్జనంలో ఆకర్షణగా నిలిచిన పులివేషాలు


శ్రీకాకుళం: నిమజ్జనానికి తీసుకెళుతూ...


శ్రీకాకుళం: విగ్రహాలను తరలిస్తున్న విద్యార్థులు


శ్రీకాకుళం: ఊరేగింపుగా వెళుతూ...


శ్రీకాకుళం: నాగావళి పాతవంతెనపై రద్దీ


శ్రీకాకుళం: ఊరేగింపులో మహిళలు


శ్రీకాకుళం: తప్పెటగుళ్ల ప్రదర్శన


శ్రీకాకుళం: కోలాటం ప్రదర్శన


సోంపేట: ఊరేగింపులో పాల్గొన్న యువత


జగన్నాథపురంలో ఎలుగుబంటి కళేబరం

ఎలుగుబంటి బీభత్సం

(ఐదో పేజీ తరువాయి)

తన సిబ్బందితో కలసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం హరిపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

● ఎలుగుబంటి సంచారంతో ఉద్దానం ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం నారాయణపురంలో గొరకల పాపారావుపై ఎలుగుబంటి దాడి చేసిన విషయం తెలిసిందే. మళ్లీ శనివారం మరో నలుగురిపై దాడి చేయడంతో భయాందోళన చెందుతున్నారు. ఒక ఎలుగుబంటి లేదా రెండు మూడు సంచరిస్తున్నాయోమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు పక్కన ఎలుగు కళేబరం...

మందస మండలం జగన్నాథపురం రోడ్డు పక్కన శనివారం ఉదయం ఒక ఎలుగుబంటి కళేబరం స్థానికులకు కనిపించింది. ఈ విషయాన్ని పోలీసులకు, అటవీశాఖ అధికారులకు చెప్పారు. వారు అక్కడకు చేరుకుని ఎలుగుబంటి కళేబరాన్ని పరిశీలించారు. పశువైద్యుడు దువ్వాడ శ్రీకాంత్ పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, ఈ ఎలుగుబంటి మూడు పిల్లలతో నల్లబొడ్లూరు వద్ద రోడ్డుపై తిరుగుతుండేది. రాత్రి సమయంలో ట్రాక్టర్ ఢీకొని పిల్లలు మృతి చెందినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లి ఎలుగు మతిస్థిమితం కోల్పోయి గ్రామాల వెంబడి తిరిగి దాడులకు పాల్పడేదని పేర్కొన్నారు. దీంతో స్థానికులు ఆ ఎలుగును చంపివేశారని పలువురు ఆరోపిస్తున్నారు.

పొలం వెళ్లాలంటే.. గెడ్డ దాటాల్సిందే

(ఐదో పేజీ తరువాయి)

అక్రమంగా నిర్మించిన ప్రాజెక్టులు.. సరిహద్దున ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలకు శాపంగా మారుతున్నాయి. మన భూభాగంలో 18 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 11 ఓపెన్ హెడ్ చానల్స్‌కు కనీసం మరమ్మతులు చేయలేకపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. దీంతో పంట కాలువలు, గ్రోయిన్లు, రాతికట్టడాలకు రైతులే సొంతగా నిధులు వేసుకొని బాగు చేసుకునేవారు. బాహుదా ఆయకట్టు పరిధిలో 750 చెరువులు ఉన్నాయి. వాటికి నది నీటిని మళ్లించాలి. వరద పోటు తీరం, పంట పొలాలపై పడకుండా చిన్నపాటి కరకట్టలు నిర్మించాలి. బూర్జపాడు లాంటి పంచాయతీలు చాలా ఉన్నాయి. నది అవతల ప్రాంతంలో వ్యవసాయ భూములు ఉన్నాయి. అందుకే నదితో పాటు సమీప గెడ్డలపై కాజ్‌వేలు, కల్వర్టులు కట్టాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రాణాలకు తెగిస్తున్నాం..

పొలాలకు వెళ్లాలంటే ప్రాణాలకు తెగించి వెళ్లాల్సిందే. నడుంలోతులో గెడ్డలను దాటుతున్నాం. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నాం. కాజ్‌వే నిర్మించాలని దశాబ్దాలుగా అడుగుతున్నా పట్టించుకునే నాథుడు లేరు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టాలి.

-పులకల హరికృష్ణ, రైతు, బూర్జపాడు

ఏటా ఇదే పరిస్థితి..

గెడ్డలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. వర్షాకాలంలో వరద నీరు పొంగుతోంది. ఏటా ఇదే పరిస్థితి. అందుకే ముందస్తుగానే పొలాల్లో వ్యవసాయ పరికరాలు, యంత్రాలు చేర్చుతాం. మళ్లీ సంక్రాంతి తరువాత తెచ్చుకుంటాం. పక్కనే పొలాలు ఉన్నా చూడలేని పరిస్థితి మాది.

-పి.పురుషోత్తం, రైతు, బూర్జపాడు

పెండింగ్ డీఏలు మంజూరు చేయాలి

అరసవల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ జేఏసీ శ్రీకాకుళం మహిళా విభాగం ఆవిర్భావ దినోత్సవం నగరంలోని రెవెన్యూ భవన్‌లో శనివారం నిర్వహించారు. జిల్లా ఛైర్మన్ ప్రవల్లిక ప్రియ కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగినులతో సమానంగా రాష్ట్ర ఉద్యోగినులకు రెండేళ్ల చైల్డ్‌కేర్ లీవ్ మంజూరు చేయాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్ డీఏలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నేతలు శ్రీరాములు, రాష్ట్ర మహిళావిభాగం కోఛైర్‌పర్సన్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ప్రవల్లిక ప్రియ తదితరులు


ముంపునకు గురైన పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

వర్షాలకు అతలాకుతలం

- ముంపునకు గురైన పొలాలు
- దెబ్బతిన్న రోడ్లు


కోతకు గురైన పెనుగుటివాడ-కోణంగి రోడ్డు

పాతపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఒడిశా బోర్డర్ పాతపట్నంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం కురిసిన వర్షానికి పలు చోట్ల పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. కొన్నిచోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. కొండల పైనుంచి ఉధృతంగా వస్తున్న నీటితో బడ్డుమర్రి పంచాయతీ భీమునిపల్లిలో పంట పొలాల్లో ఇసుక మేటలు వేసింది. మహేంద్ర తనయ గుమ్మ గెడ్డలో వరద ఉధృతి పెరుగుతుండడంతో పరివాహక రైతాంగం ఆందోళన చెందుతోంది. పాతపట్నం కె.గోపాల పురం వద్ద గుమ్మగెడ్డకు పలుచోట్ల గండిపడ డంతో 70 ఎకరాల్లో వరి పైరు ముంపునకు గురైంది. మండల వ్యవసాయాధికారి కిరణవాణి, తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు, ఎంపీడీవో పి.చంద్రకుమారి పరిశీలించారు. పూర్తిస్థాయి అధ్యయనం చేసి పంట నష్టం అంచనా వేయనున్నట్లు ఏవో తెలిపారు. వర్షాలకు బడ్డుమర్రి పంచాయతీలోని పెనుగుటివాడ-కోణంగి బీటీ రోడ్డు కోతకు గురైంది. 2020-21లో ఈ రోడ్డు మంజూరైంది. రూ.4 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉండగా, కాంట్రాక్టర్ నిర్లక్ష్య కారణంగా అసంపూర్తిగా ఉండిపోయింది. దీంతో వర్షాలకు తోడు కొండ నీటి తాకిడికి రోడ్డు కోతకు గురైందని ఐటీడీఏ ఏఈ సీహెచ్ ప్రసాదరావు తెలిపారు. తెంబూరు-ఎస్. జగన్నాథపురం మీదుగా బడ్డుమర్రి పంచాయతీకి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

అరసవల్లిలో చాతుర్మాస్య దీక్ష ముగింపు


హాజరైన భక్తులు


ప్రసంగిస్తున్న రామానందభారతీ స్వామి

అరసవల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అరసవల్లిలో గత రెండు నెలలుగా సాగుతున్న చాతుర్మాస్య దీక్ష ముగింపు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నంలోని శ్రీ సౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి రామానంద భారతీ స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి మందిర ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ చేశారు. అక్కడికి వచ్చిన వందలాది మంది భక్తులకు స్వామి ఆశీర్వదించారు. సాయంత్రం మహిళా భక్తులకు అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, నేతింటి హరిబాబు, వి.విజయలక్ష్మి, పెద్ద సంఖ్యలో భక్త జనం పాల్గొన్నారు.

మా డబ్బులు ఎప్పుడిస్తారు?

(ఐదో పేజీ తరువాయి)

సహా చెల్లించాలని లేదంటే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని మరికొందరు పేర్కొన్నారు. దీనిపై ఎస్పీ హరిబాబు స్పందిస్తూ.. 'ఈ కేసు సీబీఐకి అప్పగించాం. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరుగుతోంది. ఇప్పటికే ఆన్‌లైన్ మోసాలకు పాల్పడిన ఐదుగురిని అరెస్టు చేశారు. నెలరోజుల్లో సమస్య పరిష్కరించి ఖాతాదారులందరికీ న్యాయం చేస్తామ'ని హామీ ఇచ్చారు. ఆందోళన వద్దని సూచించారు. దీంతో ఖాతాదారులు శాంతించారు. బాధితులకు అంగన్‌వాడీ యూనియన్ లీడర్ బి.హైమావతి, జనసేన నాయకులు దాసరిశేఖర్ మద్దతు పలికారు.

గిరిజన మహిళలకు శుభవార్త

(ఐదో పేజీ తరువాయి)

కనెక్షన్లు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. జిల్లాలో సుమారు 5వేల కనెక్షన్లు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై మెళియాపుట్టి ఎంపీడీవో ప్రసాద్ పండా వద్ద ప్రస్తావించగా.. 'ఇప్పటికే ప్రతీ ఇంటికి వెళ్లి ఎంతమంది గ్యాస్ వినియోగిస్తున్నారో సర్వే చేశాం. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ఇంకా ఆదేశాలు రాలేదు' అని తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీ

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీ చేయాలని కలెక్టర్ సప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిలతో కలిసి కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి ఎరువుల పంపిణీపై ఆయన శనివారం తహశీల్దారులు, ఎంపీడీఓలు, ఎస్ఐలు, వ్యవసాయ శాఖ ఏఓలతో వర్చువల్‌గా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎరువులకు సంబంధించి డివిజన్ స్థాయిలో ఆర్డీఓ, డీఎస్పీ, వ్యవసాయశాఖ ఏడీలతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖ ఏఓలతో ఉంటుందని చెప్పారు. జిల్లాకు వచ్చే యూరియా ఆముదాలవలస గోడౌన్‌లో నిల్వ చేసి అక్కడి నుంచి నేరుగా రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్, ప్రైవేటు వ్యాపారులకు సరఫరా చేయనున్నట్టు తెలిపారు. ప్రైవేటు పంపిణీ కేంద్రాల వద్ద ఒక వీఆర్వో లేదా సచివాలయాల సిబ్బంది ఉండాలన్నారు. ఒక్కో రైతుకు ఎంత భూమి ఉంది, ఎరువుల అవసరం ఎంత ఉంటుందో తెలుసుకోవాలని సూచించారు. యూరియా పంపిణీ వద్ద డిజిటల్ అసిస్టెంట్లు ఉండాలన్నారు. నిత్యం ప్రైవేటు, రైతు సేవా కేంద్రాల వద్ద ప్రారంభ, ముగింపు నిల్వలు సాయంత్రం నాటికి తెలియజేయాలని స్పష్టం చేశారు. రైతులకు సమస్య ఉంటే 91218 63788 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. రైతుల నుంచి వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారులతో డీలర్లు స్నేహపూర్వకంగా ఉండండి

రేషన్ లబ్ధిదారులతో డీలర్లు స్నేహపూర్వకంగా, కుటుంబ సభ్యుల్లా మాట్లాడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని రేషన్, గ్యాస్ డీలర్లతో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీలర్లు సహనంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ ధరలకే గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయాలన్నారు. డెలివరీ బాయ్స్ అధికంగా డబ్బులు వసూలు చేస్తే, అటువంటి గ్యాస్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ డీలర్లు సరుకులు ఇస్తారని తెలిపారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేస్తారని అన్నారు. రేషన్ నాణ్యతపై సివిల్ సప్లయి అధికారులు తరచుగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పౌరసరఫరాల జిల్లా మేనేజర్ వేణుగోపాల్, అధికారి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

యువత స్వశక్తితో ఎదగాలి: శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): యువత స్వశక్తితో ఎదిగి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఎంపవరింగ్ స్మాల్స్ బిజినెస్ ఓనర్స్ అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రతీ ఇంటి నుండి ఒక పారిశ్రామిక వేత్తను తయారుచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. వారికి బ్యాంకులు కూడా రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇసకలపాలెం మత్స్యకార గ్రామంలో రూ.42 లక్షలతో నిర్మించిన సచివాలయ భవన సముదాయాన్ని ఎమ్మెల్యే బెందాళం అశోక్ శనివారం ప్రారంభించారు. అనంతరం 12 మంది మత్స్యకారులకు ప్రభుత్వం ఉచితంగా మంజూరు చేసిన జీపీఎస్ పరికరాలను పంపిణీ చేశారు. అంతకుముందు చేపల గొల్ల గండికి చెందిన 25 మంది మత్స్యకారు లకు ప్రభు త్వం సబ్సిడీపై మంజూరు చేసిన వలలు, బోటు ఇంజన్లను అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, సర్పంచ్ బైపల్లి అంకమ్మ, గ్రామస్థులు బైపల్లి ఈశ్వరరావు, బైపల్లి బాబూరావు, జీవన్‌రావు, రామారావు పాల్గొన్నారు.

పరిశ్రమలను అడ్డుకుంటే అభివృద్ధి శూన్యం

● ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్


రహదారి పనుల శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రాం తం అభివృద్ధి చెందాలన్నా నిరుద్యోగులకు ఉపాధి లభిం చాలన్న పరిశ్రమల స్థాపనతోనే సాధ్యపడుతుందని, వీటిని అడ్డుకుంటే అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్ అన్నారు. వెన్నెవలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో రూ.4.36 కోట్లతో చేపట్టనున్న అదనపు భవనాల నిర్మాణాలకు, సరుబుజ్జిలిలో చేపట్టనున్న రోడ్ల విస్తరణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. అలాగే వెన్నెవలస జవహర్ నవోదయ విద్యాలయంలో నూతనంగా నిర్మించిన అటల్ టింకరింగ్ ల్యాబ్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒకప్పుడు మండల కేంద్రం ఇరుకైన రహదారు లతో వాహనాల రాకపోకలకు ఎంతో ఇబ్బందులు పడేవారని, వాటిని నివారించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో రూ.12 కోట్ల వ్యయంతో రోడ్ల విస్తరణ చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు రూ.30 వేల కోట్లతో 3,200 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగు తోందన్నారు. కార్యక్రమంలో గిరిజన శాఖ ఈఈ రమా దేవి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ తిరుపతి రావు, జేఈ నాయక్, ఎంపీడీవో ఎం. పావని, తహసీల్దార్ ఎల్.మధు సూదన్, డీసీసీబీ ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, టీడీపీ జిల్లా నాయకుడు పీఎంజేబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, నందివాడ గోవిందరావు, కిల్లి సిదార్థపాల్గొన్నారు.

తిమ్మాపురంలో...

ఆమదాలవలస, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పురపాలకసంఘంలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం తిమ్మాపురంలో రూ.35. 55 లక్షలతో 1, 22, 23 వార్డుల్లో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువల పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, నాయకులు మొదలవలస రమేష్, నూకరాజు, చాపర సుధాకర్, పేడాడ రామ్మోహన్‌రావు, కూటమి నేతలుతదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పాఠశాలకు కుర్చీలు వితరణ

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): టి.బరంపురం ప్రాథమిక పాఠశాలకు గ్రామస్థులు తిప్పన దనుంజయరెడ్డి, డి.నూకరాజు కుర్చీలు, ఫ్యాన్లను శనివారం పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ డి.రాజ్యలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కారంగి త్రినాథరెడ్డి, ఉప ఛైర్మన్ మమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన ప్రముఖ జానపద సంగీత గురువు, నంది అవార్డు గ్రహీత తిప్పన ధనుంజయ రెడ్డికి శాంతినికేతన్ పాఠశాల ఛైర్మన్ దక్కత కృష్ణమూర్తి రెడ్డి, ఉపాధ్యాయులు దుశ్శాలువలతో సత్కరించారు.

'స్త్రీ శక్తి' ప్రైవేట్ బస్సులకు వర్తింపజేయాలి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన స్త్రీశక్తి పథకాన్ని ప్రైవేటు స్టేజ్ క్యారేజ్ బస్సులకు వర్తింపజేయాలని ఉత్తర శ్రీకాకుళం జిల్లా ప్రైవేట్ బస్సు ఆపరేటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా సూర్యప్రకాష్ కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు రిజిస్టర్ పోస్టులో లేఖలను పంపినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్సులకే ఈ పథకం వర్తింపజేయడం వల్ల ఆర్టీసీతో సమానంగా రవాణాశాఖ అనుమతులతో పలు ప్రాంతాల్లో తిరుగుతున్న ప్రైవేటు బస్సులు నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. తగు చర్యలు తీసుకుని ప్రైవేట్ స్టేజ్ క్యారేజ్ బస్సు యాజమాన్యాలను ఆదుకోవాలని కోరారు.

రొట్టవలస కూడలి వద్ద రిక్వెస్ట్ స్టాప్

సరుబుజ్జిలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రద్దీ ప్రాంతమైన రొట్టవలస కూడలిలో ఆర్టీసీ అధికారులు ఎక్స్‌ప్రెస్ రిక్వెస్ట్ స్టాప్‌ను మంజూరు చేశారని తెలుగుయువత మండల నాయకుడు తాడేల రాజారావు తెలిపారు. శనివారం రిక్వెస్ట్ స్టాప్ బోర్డును ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం, కొత్తూరు ఎక్స్‌ప్రెస్ బస్సులు రొట్టవలసలో నిలుపుదల చేయాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌లను కోరామని, ఈ మేరకు వారి కృషితో ఆర్టీసీ అధికారులు స్పందించి రిక్వెస్ట్ స్టాప్ మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సోంపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలసలో రజకులపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు మామిడిపల్లి ధర్మారావు కోరారు. పట్టణంలో రజక కులస్థుల సంఘ సమావేశం శనివారం నిర్వహించారు. తక్షణం బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు.

చిరుధాన్యాల తయారీ యంత్రం ప్రారంభం

లావేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బెజ్జిపురం యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో తాళ్లవలస, రణస్థలం మండలం వెంకటేశ్వర కాలనీలో జాతీయ గ్రామీణ వ్యవసాయ బ్యాంక్ అమరా వతి వారి సాయంతో 60 మంది ఎస్‌హెచ్‌జీలకు చిరుధాన్యాల తయారీ యంత్రాలను మంజూరు చేశారు. ఈ మేరకు ఈ యంత్రాన్ని శనివారం నాబార్డు జిల్లా అధికారి రమేష్ కృష్ణ, ఎల్‌డీఎం శ్రీనివాస్ ప్రారంభించారు. ఆహార ఉత్పత్తుల తయారీకి ఈ యంత్రం ఉపయోగపడుతుందని, ఈ ఉత్పత్తులకు డీఆర్‌డీఏ మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుందన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన అవసరం

● డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత


5కె రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో దా.కె.అనిత

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని డీఎంహెచ్‌వో డా.కె.అనిత అన్నారు. యూత్ ఫెస్ట్-2025లో అవగాహన కల్పించేందుకు ఐఈసీ మారథాన్ 5కె రెడ్‌రన్ శనివారం 80 అడుగుల రోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది ఒకరి నుంచి మరొకరికి, సురక్షితం కాని సెక్స్, రక్తమార్పిడి, సిరంజీల ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఈ మారథాన్ 5కె రన్‌లో 55 మంది పురుషులు, 15 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్ జెండర్లు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీజే అప్పల నాయుడు, టి. శ్రీకాంత్, ప్రసా దరావు, శైలజ, డి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న న్యాయాధికారి బి.జ్యోత్స్న

పొందూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాలికలు తమ హక్కులను పరిరక్షించుకునేందుకు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక సివిల్ కోర్టు న్యాయాధికారి బి.జ్యోత్స్న అన్నారు. పొందూరు బాలికల వసతిగృహంలో శనివారం బాలికల చట్టాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను అడ్డుకోవాలంటే బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ అవసరమన్నారు. బాల్యవివాహాలను అడ్డుకోవడంలో బాలికలే కీలకపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.రామ్మోహన్, ఎం.రాము వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీలో లోపాలు లేకుండా చూడాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం ఖాజీపేటలో శనివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఎరువుల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తెలియజేయాలని కోరారు. ఎరువుల సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా తక్షణమే అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.గణపతి, వ్యవసాయాధికారి పి.నవీన్ పాల్గొన్నారు.

ఎరువులను సక్రమంగా అందించాలి

● అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్

ఆమదాలవలస, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులను సక్రమంగా అందించాలని అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు దూసి రైతు సేవా కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతిలో ఎరువులను సరఫరా చేయాలన్నారు. మూడు విడతలకు కలిపి ఎకరాకు 75 కేజీల చొప్పున రైతులకు ఎరువులు అందించాలన్నారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు


తనిఖీ నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పట్టణంలో విజిలెన్స్ సీఐ సతీష్ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాల్లో శనివారం తనిఖీలు చేపట్టారు. శివబాలాజీ మన గ్రోమోర్, వైశ్యరాజు శ్రీరామరాజు ఎరువుల దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. ఆయనతో పాటు తహసీల్దార్ ఎస్. రాంబాబు, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానంతో మరొకరికి వెలుగు


ప్రతిజ్ఞ చేస్తున్న జగన్మోహనరావు, రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గుజరాతీపేట. సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేత్రదానంతో మరొకరికి వెలుగును ప్రసాదించవచ్చని రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా యూత్ రెడ్ క్రాస్, కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తి చనిపోయిన తర్వాత నేత్రదానం ఇచ్చేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రావాలని, తద్వారా వేరొకరికి ప్రపంచానికి చూపించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్‌పీసీబీవీ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డా.ఎస్.పుష్పలత, ఆప్తాలమిక్ ఆఫీసర్ వి. చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఎన్ఎస్ఎస్ పీవోలు హరిమానస, పైడిరాజు, రెడ్‌క్రాస్ సభ్యులు జి.రమణ, పి.చైతన్య, పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన


ప్రకృతి వ్యవసాయ చక్రాన్ని పరిశీలిస్తున్న ఉత్తర ప్రదేశ్ సభ్యులు

లావేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బెజ్జిపురం యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను శనివారం ఉత్తర ప్రదేశ్ సభ్యుల బృందం సందర్శించింది. ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాల చక్రాన్ని సదరు సభ్యులు పరిశీలించగా చక్రం ఆవ శ్యకతను ఎన్ఎఫ్ఏ గోవిందరెడ్డి వివరించారు. ప్రకృతి వ్యవసాయ చేసేందుకు అవసరమైన ఇన్‌పుట్ బీజా, ఘన, ద్రవ, జీవామృతం, విషముడి కషాయం, జిల్లేడు ద్రావణం తయారీ విధానాలను అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్, అడిషనల్ డీపీఎం ధనుంజయ్, ఎన్ఆర్‌వో టీం సభ్యులు తరుణ్ ఆదిత్య, బి.శ్రీనుతదితరులు పాల్గొన్నారు.

జన సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

జి.సిగడాం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జనసురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మ్యాగ్నెట్ కన్సల్టెన్సీ జిల్లా సమన్వయకర్త బి.అనంతకుమార్ కోరారు. శనివారం పెనసాంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేట్ మ్యాగ్నెట్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో జన సురక్ష పథకాల నమోదు కార్య క్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన సురక్ష, పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై, పీఎంజేడీవై పథకాలకు ప్రతి ఒక్కరూ నమోదు చేసుకో వాలన్నారు. బ్యాంక్ సేవలు ప్రజలకు చేరువ కావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈనెల 30 వరకు ప్రతీ గ్రామంలో ఒక శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ పెన్నామ్, బ్యాంక్‌మిత్ర బి.వెంకటరత్నం, సర్పంచ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆదివారం జరుగనున్న ఫారెస్ట్ అధికారుల పరీక్ష ఏర్పాట్లను శనివారం ఏపీపీఎస్సీ సభ్యుడు సోనీ వుడ్ పరిశీలించారు. జిల్లాలో శ్రీచైతన్య ఈ టెక్నో స్కూల్, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల, మహిళా డిగ్రీ కళాశాలలు, చిలకపాలెం శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన సూచించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లావేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేశవరాయునిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎర్‌డీఎస్ ఎస్‌లో భాగంగా బ్రేకర్ కోసం పనులు చేపడుతున్నందున సోమవారం విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కేశరాయునిపాలెం, లోపెంట, మురపాక, పెదరావుపల్లి, బయ్యన్నపేట, గుంటుకుపేట, లక్ష్మీపురం, పట్నా వానిపేట, రేగపాలేం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎరువుల కూపన్లు పంపిణీ

సోంపేట, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రెండో విడత ఎరువులను వ్యవ సాయశాఖ కార్యాలయంలో ఏడీ టీ.భవానీ శంకర్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎవరూ ఆందోళన పడవద్దని, రెండు రోజుల్లో మండలానికి సరిపడా ఎరువులు వస్తాయన్నారు. ఆయనతో పాటు ఏవో బి.నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

నేడు ఉమారుద్ర కోటేశ్వరాలయం మూసివేత

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): చారిత్రక ప్రసిద్ధి చెందిన నగరంలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయం చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మూసి వేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ఆరవెల్లి శ్రీరామ్మూర్తి శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి సోమవారం వేకువజామున నాలుగు గంటల నుంచి స్వామి దర్శనం ప్రారంభమవుతుందన్నారు. ఆది వారం రాత్రి 9.54 గంటల నుంచి గ్రహణం ప్రారంభమై విడుపు 1.26 గంటలకు ఉంటుందన్నారు. సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఆలయం తెరిచి దర్శనాలు ప్రారంభిస్తామని, ఆ సమయంలో దానాలు, అభిషేకాలు చేసుకోవచ్చన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి


వినూత్నను అభినందిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆర్‌జీ యూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ కేవీజీ బాలాజీ అన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసో సియేషన్ నిర్వహించిన 9వ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపి యన్‌షిప్‌లో ట్రిపుల్ ఐటీ పీయూసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎస్.వినూత్న తృతీయ స్థానం పొందింది. త్వరలో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆమె ను డైరెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో ఏవో డాక్టర్ ముని రామ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఆ పాట మానోట

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య 311వ సాంస్కృతిక కార్యక్రమం బాపూజీ కళామందిర్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాట-మానోట సినీ సంగీత విభావరి నిర్వహించారు. మిమిక్రీ కళా కారుడు నంది కేశ్వరరావును సన్మానించారు. ఎల్.రామలింగేశ్వరరావు, పి.నరసింహమూర్తి, డాక్టర్ ఇ.ఎస్.వసంత్ కుమార్ సినీ గీతాలు ఆలపించారు.

సత్య, ధర్మ ప్రవర్తకులుగా రచనలు చేయాలి


శరత్‌బాబును సత్కరిస్తున్న మందిరం ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలు సత్య, ధర్మ ప్రవర్తకులుగా రచనలు చేయాలని ప్రముఖ సాహితీవేత్త జంధ్యాల శరత్ బాబు అన్నారు. నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కోదండ రామాలయంలో ఉపనిషన్మం దిరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాహిత్య గణపతి ఉత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'కరుణ శ్రీకారం' అంశంపై సాహితీ ప్రసంగం చేశారు. సహిత హితమే గణపతి తత్వమన్నారు. సమరస భావంతో సర్వత్రా సమన్వయం సాధించడమే సాహిత్యం అని అన్నారు. నవత, మానవత, కవి కవితలో అంతట నీవే స్వామి అంటూ కరుణ శ్రీ శ్రీకారం పలకడాన్ని ఇప్పుడు వినాయక విగ్రహాల నిమజ్జన వేళ మనం అన్వయించుకోవాలన్నారు. హిత పూరితమే సాహిత్యమని, సకల సమ్మతమే గణపతి తత్వమని పేర్కొన్నారు. అనంతరం వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో మందిరం ప్రతినిధులు పట్నాయక్, బాపయ్య పంతులు, విశ్వేశ్వరరావు, డా.సనపల నారాయణ మూర్తి, నిష్టల నరసింహ మూర్తి, డా.కోమలరావు తదితరులు పాల్గొన్నారు.

సముద్ర తీరాలకు సోలార్ వెలుగులు

● గ్రామాలకు చేరిన పరికరాలు



తీర గ్రామాలకు చేరిన సోలార్ పరికరాలు

సోంపేట రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీరప్రాంత గ్రామాల్లో నివసిస్తున్న మత్స్య కారులు రాత్రి వేళల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించాలని లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్య, సాగరమాల పథకం కింద సోలార్ లైట్లను ఏర్పాటు చేయనున్నాయి. ఇందులో భాగంగా సోంపేట మండలం ఇసుకలపాలెం, రామయ్యపట్నం, గొల్లగండి, బట్టిగళ్లూరు, నడుమూరు, ఎకువూరు, ఎర్ర ముక్కాం తదితర గ్రామాలకు సోలార్ సామగ్రి శనివారం చేసింది. వేకువజామున వేటకు వెళ్లే సమయంలో చీకటి వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సోలార్ లైట్లు ఏర్పాటు వల్ల సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ మేరకు సోలార్ లైట్లను మంజూరు చేసిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడులకు మత్స్యకారులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీకూర్మనాథుని సేవలో ఎంపీ హైకోర్టు న్యాయమూర్తి


న్యాయమూర్తికి కూర్మనాథుని చిత్రపటం అందిస్తున్న ఈవో నరసింహనాయుడు

గార, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథ స్వామిని శనివారం మధ్యప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విశాల్ దఘాట్ దంపతులు దర్శించుకున్నారు. వీరికి అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారి సన్నిధిలో వారి పేరున ప్రత్యేక పూజలు చేశారు. ఆల య చరిత్ర, విశిష్టతను అర్చకులు వివరించగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. స్వామివారి చిత్రపటాలను ఈవో కె.నరసింహనాయుడు, ప్రధాన అర్చకుడు సీతారామ నరసింహాచార్యులు అందించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

● మంత్రి అచ్చెన్నాయుడు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై అధికారులు తక్షణం స్పందించి వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి తమ సమస్యలపై మంత్రి అచ్చెన్నకు అర్జీలు అందజేశారు. టెక్కలి వెంకటేశ్వరకాలనీ మూడోలైన్‌తో పాటు కొత్తమ్మతల్లి వీధికి సీసీ రోడ్లు, కుళాయిలు లేవని బెండి కవిత, ఎస్.అరుణ, అక్కవరం-చింతలగార మధ్య రోడ్డు పూర్తిచేయాలని పొన్నాడ నాగు, మంచాల సింహాచలం వినతులు అందజేశారు. తమ గ్రామానికి యూరియా సరఫరా చేయాలని నందిగాం మండలం తమలాపురం రైతులు, నౌపడా-మెళియాపుట్టి రోడ్డులో వంశధార కాలువ పక్కనున్న విద్యుత్ స్తంభాలన్నీ వాలిపోయాయని, వాటిని సరిచేయాలని టెక్కలికి చెందిన లైసెట్టి దుర్గారావు, రావివలస చెరువు వద్ద నిర్మాణం జరుగుతున్న డ్రైనేజ్ పనులు సాంకేతికత పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎల్ఎల్ నాయుడు మంత్రిని కోరారు. నందిగాం మండలం కల్లాడ గ్రామంలో కొండపోరంపోగు పట్టాలు మంజూరు చేయాలని పలువురు అర్జీ అందజేశారు. రావివలస పంచాయతీ చిన్ననారాయణపురంలో స్టాక్‌పాయింట్ ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ బడే జగదీష్, స్థానిక పోలీస్‌స్టేషన్ వెనుక ఎన్టీఆర్ కాలనీకి వెళ్లే రహదారికి సీసీ రోడ్లు మంజూరు చేయాలని పలువురు అర్జీ అందజేశారు. ఆ అర్జీలను ఆయా శాఖల అధికారులకు వెంటవెంటనే మంత్రి అందజేస్తూ సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని దిశ నిర్దేశించారు. ఆయనతో పాటు నాయకులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, ఎల్ఎల్ నాయుడు, హనుమంతు రామకృష్ణ, లవకుమార్, కామేసు, సుందరమ్మ, ప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులందరికీ ఎరువులు అందిస్తాం

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి
● వెలుగు ఏపీఎంకు షోకాజ్ నోటీసులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ సకాలంలో ఎరువులు అందించి ఆదుకోవడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనివార్యకారణాలతో ఈ ఏడాది జూలైలో యూరియా రానందున కొంతమంది వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి రైతులకు వాటిని అందకుండా చేశారని అన్నారు. పాగోడు వ్యవసాయ సహాయకుడు మెండ వెంకటేశం విధులకు డుమ్మా కొట్టి రైతులకు అందుబాటులో ఉండడం లేదని గ్రామ సర్పంచ్ దామ మన్మథరావు, శ్రీముఖలింగం ఎంపీటీసీ కె.హరిప్రసాద్ సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. వెలుగు ఏపీఎం హేమసుందరరావు గత మూడు సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరయ్యారని, ఆయనకు షోకాజ్ నోటీసు జారీచేయాలని ఎంపీపీ, ఎంపీడీవోలను ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే వ్యవసాయాధికారి రవికుమార్ సర్వసభ్య సమావేశానికి గైర్హాజరవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, పర్లాం డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు కింజరాపు సత్యం, చల్లవానిపేట సొసైటీ అధ్యక్షుడు దుంగ స్వామిబాబు, డిప్యూటీ తహసీల్దార్ మధు తదితరులు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగ పరచుకోవాలి

ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగ పరచుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గొటివాడకు చెందిన వెంకటేశ్వర కిసాన్ సభ్యులకు రాయితీపై డ్రోన్ యంత్రాన్ని శనివారం అందించారు రూ.9.80 లక్షల విలువ గల డ్రోనును రైతులకు రాయితీపై రూ.2 లక్షలకే ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ మధు, టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గురువుల సేవలు వెలకట్టలేనివి

పోలాకి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను బావిపౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ప్రముఖ పాత్రవహిస్తారని, వారి సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. ఎంఈవో శ్రీనివాసనాయక్, ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాయకులు చింతాడ దిలీప్‌కుమార్, మల్లేశ్వరరావు, కూటమినాయకులు పాల్గొన్నారు.

యూరియా పక్కదారి పట్టకుండా చూడాలి

● శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష



పలాసరూరల్: టెక్కలిపట్నం సచివాలయం వద్ద ఎరువుల కోసం రైతుల పడిగాపులు

జలుమూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యూరియా పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయిప్రత్యూష అన్నారు. గొటివాడ రైతు సేవా కేంద్రంలో శనివారం జరిగిన యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అర్హత కలిగిన రైతులందరికీ యూరియా అందించే బాధ్యత వ్యవసాయశాఖపై ఉందన్నారు. రైతుల ఆధార్, 1బీ ఆధారంగా యూరియా పంపిణీ చేయాలని అన్నారు. తహసీల్దార్ జె.రామారావు, వ్యవసాయాదికారి కె.రవికుమార్, ఆర్ఐ కిరణ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతుల పాట్లు..

పలాసరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): టెక్కలిపట్నం సచివాలయం వద్ద శనివారం డీఏపీ, యూరియాను అధికారులు పంపిణీ చేశారు. కేవలం ఒక్కొక్క బస్తాను మాత్రమే ఇవ్వడంతో అధికంగా పొలం కలిగిన రైతులు పాట్లు పడ్డారు. అధికారులు ముందు జాగ్రత్తగా పోలీసు రక్షణ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా, ఏఎస్ఐ నచ్చజెప్పినా రైతులు వినలేదు.

పెద్దపద్మాపురంలో నిరసన

మెళియాపుట్టి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపద్మాపురం గ్రామానికి 106 బస్తాల ఎరువు వచ్చింది. పంపిణీ కోసం శనివారం అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఒక రైతుకు ఒక బస్తానే ఇస్తామని వ్యవసాయ అధికారులు చెప్పారు. దీంతో ఆ ఎరువులు తమకు వద్దంటూ రైతులు నిరసన తెలిపారు.

సరిపడినవి ఇవ్వాలి..

టెక్కలి రూరల్,సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడిన ఎరువులు అందజేయాలని మెఖలింగపురం, నర్సింగపల్లి పంచాయతీ రైతులు శనివారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు విన్నవించారు. తక్కువ ఎరువులు ఇవ్వటంతో గ్రామాల్లో తగదాలు జరుగుతున్నాయని తెలిపారు. మంత్రికి కలినవారిలో మాజీ సర్పంచ్ పి.షన్ముఖరావు, డి.పాపారావు, పి.శంకరరావు తదితరులు ఉన్నారు.

నేడు, రేపు యూరియా పంపిణీ

నరసన్నపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోమర్తి, జమ్ము, కామేశ్వరిపేట, కరగాం, తెలగలవలస, చిక్కాలవలస, ఉర్లాం రైతుసేవా కేంద్రాలకు(ఆర్ఎస్‌కే) యూరియా వచ్చినట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయదేవి తెలిపారు. శనివారం జమ్ము ఆర్ఎస్‌కేలోని యూరియా స్టాక్‌ను ఆమె పరిశీలించారు. ఆదివారం ఉర్లాం, సోమవారం చిక్కాలవలస, కామేశ్వరిపేట, చోడవరం జమ్ము రైతు సేవాకేంద్రాల్లో యూరియా పంపిణీ చేయనున్నట్లు ఏవో సూర్యకుమారి తెలిపారు.

దుకాణాల తనిఖీ

హిరమండలం, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారి సంధ్య, ఎంపీడీవో కాశీప్రసాదరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాదరావు శనివారం తనిఖీ చేశారు. రికార్డులు, నిల్వలు పరిశీలించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థినికి నగదుతోపాటు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పాతమేఘవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులకు శనివారం జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ సూరాడ జోగారావు నగదు ప్రోత్సాహకాలు అందించారు. 2024-25 విద్యాసంవత్సరంలో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన కోడ బిందుకు రూ.3వేలు, డొంక దివ్యకు రూ.2వేలతో షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.మాధవరావు ఉపాధ్యాయులు శివజ్యోతి, తిరుమలరావు, దుర్యోధన పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా శక్తి యాప్

కాశీబుగ్గ, సెప్టంబర్ 6(ఆంధ్రజ్యోతి):మహిళలకు రక్షణగా శక్తి మొబైల్ యాప్ ఉపయోగపడుతుందని కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు అన్నారు. శనివారం కాశీబుగ్గలోని సూర్యతేజ జూనియర్ కళాశాలలో డైరక్టర్ దానేటి పద్మజీకామేశ్వరరావు ఆధ్వర్యంలో శక్తియాప్ ఆవశ్యకతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థిని తన మొబైల్‌లో శక్తియాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'పల్లెనిద్ర'

హరిపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు. మందస మండలం మఖరజోల పంచాయితీ అల్లిమెరకలో శుక్రవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా వెంటనే తెలియజేయాలని కోరారు. మహిళలు, యువత వివాదాలకు దూరంగా ఉండి గ్రామాభివృద్ధిపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

పలాసరూరల్,సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఆర్డీవో వెంకటేష్ అన్నారు. రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా ప్రేమతరూ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఆర్డీవో హాజరై మాట్లాడారు. ప్రతీ విద్యార్థి వారి ప్రాంతాల్లో మొక్కలను నాటి పర్యావరణ సంరక్షణకు పాటుపడాలని కోరారు. ఎంఈవో శ్రీనివాసరావు, సత్యసాయి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు హాజరుకాని సమావేశాలెందుకు?



మాట్లాడుతున్న సభ్యులు

మందస, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అధికారులు హాజరుకానప్పుడు మండల సమావేశాలు ఎందుకని ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్ ఎంపీపీ సీర ప్రసాద్‌తో పాటు సభ్యులు ధ్వజమెత్తారు. ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసాధారణ సమావేశం శనివారం నిర్వహిం చారు. ముఖ్య అధికారులు హాజరుకాకుండా కింది స్థాయి ఉద్యోగులు హాజరుకావడం, మరికొంత మంది అధికారులు సమయానికి రాకపోవడంపై సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వైద్యశాఖ అధికారులు మాట్లాడుతూ.. మండలంలో 29మంది ఏఎన్ఎంలకు గాను 12మంది మాత్రమే ఉన్నారని, మందస, బుడంబో, సిరిపురం పీహెచ్‌సీలకు ఏఎన్ఎంల కొరత వేధిస్తుందని అన్నారు. హరిపురం-బాలిగాం రహదారిపై ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు ఎరువుల కోసం కాపలా కాస్తున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. అనంతరం వివిధశాఖాధికారులు ఆయా శాఖల ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీవో తిరుమలకుమార్, ఎవో రుషేశ్వరరావు, రీసర్వే డీటీ సుబ్రహ్మణ్యశర్మ, వివిధశాఖాధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న దృశ్యం

జలుమూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) డి.పృథ్వీరాజ్‌కుమార్ అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా జలుమూరు, సైరిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రి గదులు, ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోగులకు నమ్మకం కలిగేలా మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ జె.రామారావు, ఆర్ఐ కిరణ్, వైద్యాధికారులు జి.సుజాత, ఎం.సంధ్యారాణి, గురునాథరావు, సీహెచ్‌వో ఎస్.పద్మావతి, ఆరోగ్యవిస్తరణాధికారి శిమ్మ సోమేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

టెక్కలి రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) హెచ్ఐవీపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని చైల్డ్‌ఫండ్ ఇండియా జోనల్ సూపర్‌వైజర్ సుధాకర్ తెలిపారు. శనివారం రావివలసలో పలువురికి రక్తపరీక్షలు నిర్వహించారు. హెచ్ఐవీ బారిన పడినవెంటనే మందులు వాడాలని, దీనివల్ల కొన్ని రోజులు జీవించే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

240 లీటర్ల సారా స్వాధీనం

కంచిలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి రెండు ద్విచక్ర వాహనాలపై అక్రమంగా తరలిస్తున్న 240 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు సోంపేట ఎక్సైజ్ సీఐ జీవీ రమణ తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. చొట్రాయిపురం బస్టాప్ వద్ద ఒక ద్విచక్రవాహనాన్ని పట్టుకొని దానిపై 8 పాలిథిన్ సంచుల్లో ఉంచి రవాణా చేస్తున్న 120 లీటర్లు (1200 సారా ప్యాకెట్లు) స్వాధీనం చేసుకున్నామ న్నారు. ఈ కేసులో కాలాపానికి చెందిన సవర నాయక్, బూరగాం గ్రామానికి చెందిన కొర్రాయి గోవింద్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరికి సారా సరఫరా చేసిన బూరగాంకి చెందిన కర్రి మోహిని, రాపాక కృష్ణమూర్తి, గోకర్ణపుర్నానికి చెందిన అయితి దాశరథిలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనంపై కేబీ నౌగాంకు చెందిన పంకూ గౌడ్, కాకర్లపుట్టుగకి చెందిన కాకర్ల సోమేష్ సారా తరలిస్తుండగా జలంత్రకోట పాతాళేశ్వర దేవాలయం వద్ద పట్టుకుని వారి వద్ద నుంచి 120 లీటర్లు (1200 సారా ప్యాకెట్లు) స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది మార్కారావు, భాను, అరుణ్, ఉమాపతి, గుణాకర్ పాల్గొన్నారని పేర్కొన్నారు.

మురికి కాలువలో పడి వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వాంబేకాలనీ సమీపంలో కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వాంబేకాలనీలో జొన్నాడ రాజేష్ (36) మెకానిక్‌గా పనిచేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో కొన్నేళ్లుగా ఉంటున్నాడు. ఈయన గతంలో కుమ్మరివీధిలో ఉండేవాడు. అక్కడ వినాయకుని నిమజ్జనం కోసం శుక్రవారం రాత్రి వెళ్లి మద్యం తాగాడు. మధ్యలో రాజేష్ భార్య ఫోన్ చేసి పిలవడంతో తన స్నేహితుడి బైక్‌పై ఇంటికి వెళ్లిపోయాడు. అయితే ఇంటి వద్ద కాలువ దాటుతున్న సమయంలో రాజేష్ అందులో పడిపోయాడు. శనివారం ఉదయం కాలువలో మృతదేహం కనిపించడంతో స్థానికులు రాజేష్ భార్యకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకటో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచ నామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ జగన్నాథం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్‌కు మెమోలు

కొత్తూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): లబ్బ ఆశ్రమ పాఠశాల హెచ్ఎం విశ్వనాథం, డిప్యూటీ వార్డెన్ ఎం.అప్పారావుకు చార్జిమెమోలు జారీ చేసినట్లు ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు తెలిపారు. శనివారం లబ్బ ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పరిసరాలు శుభ్రంగా లేకపోవటంతో పాటు తరగతి గదులు, వసతి గృహం పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ సక్రమంగా అమలు కావడం లేదని గుర్తించారు. ఈ మేరకు హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్‌కు చార్జిమెమోలు ఇచ్చారు. గదుల్లో కచ్చితంగా ఫ్యాన్లు ఉండాలని, కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని ఆదేశించారు.

బంగారు దుకాణాల బంద్

నరసన్నపేట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణానికి చెందిన బంగారం వ్యాపారి పొట్నూరు వెంకటపార్వతీశం గుప్త హత్యకు నిరసనగా శనివారం పట్టణంలోని బంగారు దుకాణాలను వ్యాపారులు మూసివేశారు. గుప్తను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి వాణి

నరసన్నపేట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న నిర్వహించనున్న లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎస్.వాణి అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నౌపడ, నరసన్నపేట, పోలాకి పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు రాజీచేయాలని, దీనిపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐలు దుర్గాప్రసాద్, రంజిత్, నారాయణస్వామి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి సహకారం



మాట్లాడుతున్న వెంకన్నచౌదరి

పలాస, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి లఘు ఉద్యోగ్ భారత్ సంపూర్ణ సహకారం అందిస్తుందని ఆ సంస్థ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మార్పు వెంకటేష్, జాతీయ కార్యవర్గసభ్యుడు కృష్ణ బాలాజి, విశాఖ జిల్లా కార్యదర్శి రాజేంద్ర, పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి తెలిపారు. శనివారం స్థానిక జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం మందిరంలో ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్ అధ్యక్షతన జీడి, రైస్‌మిల్లర్ల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పలాసలో తొందరలోనే లఘు ఉద్యోగ్ భారత్ శాఖ పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా టీడీపీ వాణిజ్యవిభాగం అధ్యక్షుడు టంకాల రవిశంకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

క్యూపీఐఏఐతో ఐతమ్ ఎంవోయూ



ఒప్పందం కుదుర్చుకుంటున్న దృశ్యం

టెక్కలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల (ఐతమ్) క్యూపీఐఏఐ అనే ప్రముఖ క్వాంటమ్ కంప్యూటింగ్ సంస్థతో ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ మేరకు శనివారం ఐతమ్ చైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు, క్యూపీఐఏఐ వైస్‌ప్రెసిడెంట్ ఎల్.ప్రియదర్శి, ప్రొడక్ట్ లీడర్ ఎం.చంద్రమౌళి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం వల్ల కళాశాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు అనేక లాభాలు చేకూరుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నెల 17 నుంచి 21 వరకు బెంగళూరు కేంద్రంగా అధ్యాపకులకు అధునాతన శిక్షణ ఇవ్వనున్నట్లు క్యూపీఐఏఐ సంస్థ ప్రతినిధులు తెలిపారు. రీసెర్చ్ ప్రాజెక్ట్ తయారుచేసి క్వాంటం ల్యాబ్‌లను కళాశాలలో పెట్టేవిధంగా కేంద్ర ప్రభుత్వం అనుమతులు పొందడానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రస్తుత ఏఐ రంగంలో మేధోసంపత్తి పెంచుకొన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందవచ్చునని అన్నారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో ఐతమ్ కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, ట్రెజరర్ నాగరాజు, డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, బుడుమూరు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లి, సెప్టెంబరు 06(ఆంధ్రజ్యోతి): సూర్యనారాయణ స్వామివారిని క్యూపీఐఏఐ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ లక్ష్య ప్రియదర్శి, సీనియర్ ప్రోడక్టు లీడర్ చంద్రమౌళి శనివారం దర్శించుకున్నారు. వారికి స్వామివారి ఆశీర్వచనాలు, ప్రసాదాలు, జ్ఞాపికను అర్చకులు అందజేశారు.

ఎంఈవో-2గా శ్రీనివాసరెడ్డి

పోలాకి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారి-2గా దీర్ఘాశి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసరెడ్డి శనివారం ఎంఆర్‌సీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గత నెల 31న ఎంఈవో -2 లింగరాజు పదవీ విరమణ చేశారు. దీంతో నూతనంగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

రేపు టెన్నికాయిట్ జట్ల ఎంపిక

పలాస, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలకు మహిళ, పురుషుల జట్ల ఎంపికను సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తామని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లా సంతోష్‌కుమార్, కార్యదర్శి సుడియా జోగారావు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలు, నాలుగు పాస్‌ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

9న 'అన్నదాత పోరు'

పలాస, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై ఈ నెల 9న వైసీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం తన కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు.

టెక్కలి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తుందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్ అన్నారు. అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం పార్టీ కార్యాలయంలో వారు ఆవిష్కరించారు. వైసీపీ నాయకులు దువ్వాడ వాణి, ఎన్.శ్రీరామ్మూర్తి, వెంకటేశ్వరరావు, రాజు ఉన్నారు.

సబ్ రేషన్ డిపోల మంజూరు

హిరమండలం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండ్రమనుగూడ, దబ్బగూడకు సబ్ రేషన్ డిపోలు మంజూరైనట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన

పలాస, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని వార్డు సచివాలయ ఉద్యోగులు శనివారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. వలంటీర్ వ్యవస్థ రద్దయిన తరువాత తమపై పనిబారం పెరిగిందని, జాబ్‌చార్ట్ ప్రకారం విధులు అప్పగించాలని కమిషనర్ ఎన్.రామారావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు చక్రధరి, ఉదయ్‌శంకర్‌పాత్రో, బి.మౌనిక, రోజ, దామోదర్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షలు ఒడియాలో నిర్వహించాలి

హరిపురం,సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎంఎంఎస్ పరీక్షలు ఒడియా మీడియంలో నిర్వహించాలని మందస మండల పీఆర్‌టీయూ అధ్యక్ష కార్యదర్శులు కె.సాంబమూర్తి, కిషోర్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఎంఈవో లక్ష్మణరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో పది మండలాల్లో ఒడియా మీడియం పాఠశాలలు ఉన్నాయన్నారు. దీంతో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో జరుగుతున్న పరీక్షలతో ఒడియా విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అధికారులు స్పందించి ఒడియా మీడియంలో పరీక్షలు నిర్వహించాలని కోరారు.

బొడ్డపాడు హాస్టల్ తనిఖీ

పలాసరూరల్, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు బీసీ హాస్టల్‌ను డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి త్రినాథరావు శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు సకాలంలో ఆహారం అందించడం లేదని, వారి హాజరు హైస్కూల్ వద్ద వేస్తున్నారని, జాయినింగ్ సమయంలో నగదు వసూలు చేస్తున్నారని, వార్డెన్ కోదండరావు సరిగా స్పందించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు నుంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు బీసీ వెల్ఫేర్ అధికారి త్రినాథరావు తనిఖీ చేపట్టారు. హైస్కూల్ హెచ్ఎం వీరరాజు, విద్యార్థులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఆసుపత్రులకు అనుమతులు ఉండాలి

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అర్హత, అనుమతి లేకుండా నడిపే ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథరిన్ హెచ్చరించారు. శనివారం దేవునల్తాడ జంక్షన్‌లో శారదాదేవి మెడికల్ స్టోర్సు ఆమె పరిశీలించారు. సంచి వైద్యుడు కె.లక్ష్మణరావు ఆసుపత్రిని నడుతూ రోగులకు మోసం చేస్తూరనే సమాచారంతో తనిఖీలు నిర్వహించామని ఆమె చెప్పారు. మెడికల్ షాపులో హై యాంటి బయాటిక్స్ ఇంజక్షన్స్ ఉన్నట్లు గుర్తించామన్నారు. లక్ష్మణరావుపై కేసునమోదు చేస్తామని పేర్కొన్నారు. ఆసుపత్రిని సీజ్‌చేసి తదుపరి ఆదేశాల వచ్చేవరకు తెరవకూడదని ఆదేశించారు. టెక్కలి డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ యుగంధర్, గోవిందపురం పీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్‌కుమార్, పార్మాసిస్టు సుబ్రహ్మణ్యం ఉన్నారు.